సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 15 । మే । 2024



దివ్య ఔషధం
పశ్చిమ మన్యప్రాంతంలో అరుదైన మొక్క ఎర్రచిత్ర మూలం పలు వ్యాధుల చికిత్సకు దివ్య ఔషధంగా పనిచేస్తోందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. 8లో ▸



సేంద్రియ ఎరువు మేలు
ఉద్యాన పంటల్లో సమగ్ర పోషక యాజమాన్యాన్ని పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



ఆమెదే పైచేయి
సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మహిళా ఓటర్లే పైచేయిగా నిలిచారు. జిల్లాలో 6,14,077 మంది మహిళలు ఓట హక్కు వినియోగించుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ శ్రేణులందరికీ కృతజ్ఞతలు

రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: ఎన్నికల్లో తన కోసం అహర్నిశలు శ్రమించిన తణుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. పార్టీ శ్రేణులంతా ఎన్నికల నేపథ్యంలో రాత్రి పగలు నాకోసం కష్టపడి పనిచేశారని, వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నానని, ఈ 59 నెలల కాలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ప్రజలకు మంచి చేసేందుకు ఎంతో శ్రమించారని, ఈ ఎన్నికల ముందునుంచి తనపై ప్రేమ చూపించి తనను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. వీరందరికీ తాను అండగా నిలబడతానని, ప్రజలు సైతం ఓటు వేయాలనే తపనతో మండుటెండలో పోలింగ్ బూత్‌లకు వచ్చి అధికశాతం ఓటువేయడాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఓటు వేసేందుకు మహిళలు తరలివచ్చారని, చీకటి పడిన తరువాత కూడా ఓటువేసేందుకు క్యూలో నిల్చోవడం కూడా గర్వంగా ఉందని స్పష్టం చేశారు. ఓటు వేయడం మన హక్కు అనే బాధ్యతతో ఓటు వేసి పోలింగ్ శాతాన్ని పెంచిన నియోజకవర్గంలోని అక్కలు, చెల్లెళ్లు, అన్నలు, తమ్ముళ్లు, అవ్వాతాతలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన పార్టీ శ్రేణులు..

మంత్రి కారుమూరిని కలిసేందుకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా మంగళవారం తరలిరావడంతో మంత్రి క్యాంపు కార్యాలయం కళకళలాడింది. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో ఎన్నికల సరళి, ఓటింగ్ విధానం తదితర అంశాలపై పార్టీ శ్రేణులతో మంత్రి కారుమూరి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, కర్రి కాశీరెడ్డి, సుద్దుల పాండు తదితరులు పాల్గొన్నారు.

అతిరాత్ర మహాయాగంతో సస్యశ్యామలం



అతిరాత్ర మహాయాగ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్): యాగాలతో మంచి యోగాలు కలుగుతాయని ఆంధ్రప్రదేశ్ సేవ్ టెంపుల్స్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ఈనెల 15వ తేదీ బుధవారం నుంచి నిర్వహించే అతిరాత్ర మహాయాగ కార్యక్రమాల కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ యాగాలతో మంచి యోగాలు శుభ పరిణామాలు కలుగుతాయన్నారు. ప్రపంచంలోనే ఈ అతిరాత్ర మహాయాగం గురించి దేశ విదేశాల నుంచి, రాజధాని ఢిల్లీ నుంచి కూడా దీని వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. భీమవరంలో యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ సారథ్యంలో సంపూర్ణంగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టడం శుభపరిణామం అన్నారు. భీమవరం ప్రజలంతా కూడా ఈ యాగంలో పాల్గొని స్వామివారి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ యాగంతో సుమారు 200 నుంచి 300 కిలోమీటర్ల మేర ప్రాంతమంతా సుభిక్షంగా సస్యశ్యామలంగా మారుతుందన్నారు. యజ్ఞకర్త శ్రీ జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ యాగం నిర్వహణకు సమస్త ఏర్పాట్లు జరిగాయన్నారు. పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి, నడింపల్లి బంగారాజు, విశ్వనాథరాజు, డి.సత్యనారాయణరాజు, నరహరిశెట్టి కృష్ణ, శివ పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు భారీ బందోబస్తు

ఏలూరు (మెట్రో): వట్లూరులోని సర్ సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలకు మూడంచల భద్రత వ్యవస్థను అమలు చేయనున్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో మంగళవారం ఈవీఎంలను భద్రపర్చిన గదులకు సీళ్లు వేశారు. మూడంచల భద్రత వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ) కేంద్ర భద్రతా దళాలు పహారా కాయనుండగా, దాన్ని వెలుపుల వైపు రాష్ట్ర రిజర్వ్ పోలీస్ దళాలు బందోబస్తు నిర్వహిస్తాయి. కళాశాల చుట్టుపక్కల మరో బృందం షిఫ్టుల వారిగా విధులు నిర్వహిస్తాయి. ఇలా మూడు అంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది కాకుండా 24/7 సీసీ కెమెరాలు నిఘాతో పాటు రికార్డింగ్ కూడా చేస్తాయి.

ఫ్యాన్‌దే హవా..



ఏలూరు గాంధీ నగర్ స్కూల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్‌లో మరోసారి ఫ్యాన్ హవా కొనసాగనుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మెజార్టీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారనే సంకేతాలతో పాటు టీడీపీ బలంగా ఉన్న స్థానాల్లోనూ ఫ్యాన్ పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయని, ఓటర్లు సంక్షేమ పాలనకు మద్దతుగా నిలిచారని చెబుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాల్లో కొనసాగునున్న ఫ్యాన్ హవా
- టీడీపీ కీలక స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీదే పైచేయికి అవకావం
- అర్ధరాత్రి వరకూ పోలింగ్.. పెరిగిన పోలింగ్ శాతం
- క్యూలైన్‌లో బారులు తీరిన మహిళలు, యువత
- ఏలూరు జిల్లాలో ఓటేసిన 13.67 లక్షల మంది
- పశ్చిమలో 12.16 లక్షల మంది ఓటు వినియోగం
- అత్యధిక నియోజకవర్గాల్లో స్వల్పంగా పెరిగిన ఓటింగ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పశ్చిమలో జనప్రభంజనం వెల్లివిరిసింది. మెజార్టీ స్థానాల్లో ప్రజలు సంక్షేమానికే పట్టం కట్టారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో ఏ పాలకులు చేయలేని రీతిలో ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసి ఇంటింటికీ లబ్ధి చేకూర్చడం అధికార పార్టీకి జిల్లాలో కలిసొచ్చిన అంశం. కూటమి పొత్తులు, గుర్తుల గందరగోళాలు, చివరి నిమిషంలో దిగుమతి నేతలు కేవలం దౌర్జన్యాలు, పోల్ మేనేజ్‌మెంట్‌ను నమ్ముకోవడంతో కూటమి పరిస్థితి అయోమయంగా మారింది. సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తంగా ఏలూరు జిల్లాలో 83.55 శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 82.60 శాతం నమోదైంది. 2019 ఎన్నికలతో పోల్చితే స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. సోమవారం అర్ధరాత్రికి ఏలూరు నగరంలోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌కు అన్ని ఈవీఎంలను తరలించారు. అలాగే భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, విష్ణు కాలేజీకి అన్ని ఈవీఎంలను తరలించి మంగళవారం జిల్లా రిటర్నింగ్ అధికారులు, కేంద్ర ఎన్నికల సంఘ పరిశీలకులు పరిశీలించి సీల్ వేశారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమం గడిచిన ఐదేళ్లలో పెద్ద ఎత్తున సాగింది. రెండు జిల్లాల్లో రూ.18 వేల కోట్లకు పైబడి సంక్షేమ పథకాలు, వేల కోట్ల అభివృద్ధి పనులు భారీగా జరిగాయి. ప్రభుత్వానికి పాజిటివ్ ఓటు బాగా పడిందనేది వాదన జిల్లాలో బలంగా ఉంది. ప్రధానంగా ఎండ తీవ్రతను కూడా లెక్కచేయకుండా వృద్ధులు క్యూ లైన్లల్లో బారులు తీరారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు అనుమతినిచ్చారు. ఈ క్రమంలో సుమారు రాత్రి 11 గంటల వరకు రెండు జిల్లాల్లో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ శాతం అధికంగా నమోదైంది. ఇక టీడీపీ కంచుకోట నియోజకవర్గాల్లోనూ ఫ్యాన్ హవా బాగా కనిపిస్తోందని, సైలెంట్ ఓటుతో ఓటర్లు కూటమి పార్టీకి షాక్ ఇవ్వనున్నట్లు విశ్లేషకుల భావన. ప్రధానంగా తాడేపల్లిగూడెం, దెందులూరులో కూటమి నేతలు దౌర్జన్యాలకు తెగబడినా, కైకలూరులో కూటమి అభ్యర్థి పోలీసులపై బెదిరింపులకు దిగినా ఓటింగ్ శాతం ఎక్కడా ప్రభావం చూపని పరిస్థితి. మొత్తంగా ఉమ్మడి పశ్చిమలో ప్రజలు అధికార పార్టీ వైపే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది.

పోలింగ్ సంక్రాంతి

సంక్రాంతికి జిల్లాకు బారులు తీరినట్లు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఈసారి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 50 నుంచి 60 వేల మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి జిల్లాకు వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగరంలో సెటిలర్స్ ఉన్న ప్రాంతంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఆత్మీయ సమావేశాలు నిర్వహించి పోలింగ్‌కు రావాల్సిందిగా విజ్ఞప్తి చేయగా అధికార యంత్రాంగం ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడంతో పోలింగ్ శాతం పెరిగింది. అలాగే రెండు జిల్లాల్లో 18–20 ఏళ్లలోపు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న వారి సంఖ్య 80 వేల పైచిలుకే ఉంది. దీంతో పోలింగ్ కేంద్రాల్లో యువత, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో కనిపించారు.

ఓటెత్తిన చైతన్యం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గతంతో పోలిస్తే పోలింగ్‌లో స్వల్పంగా పెరుగుదల కనిపించింది. ఏలూరు జిల్లాలో 2019లో 82.61 శాతం పోలింగ్ నమోదు కాగా 2024లో 83.55గా నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా (నర్సాపురం పార్లమెంట్) గతంలో 81.02 శాతం నమోదు కాగా ఈ సారి 82.60 నమోదైంది. అలాగే అన్ని నియోజకవర్గాల్లో స్వల్ప పెరుగుదల కనిపించింది. పశ్చిమగోదావరి జిల్లాలో 12,16,667 ఓట్లు పోలవ్వగా, ఏలూరు జిల్లాలో 13,67,999 ఓట్లు పోలయ్యాయి. రెండు జిల్లాల్లో పోస్టల్ బ్యాలెట్‌లను కలపాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ శాతం వివరాలు..

ఏలూరు జిల్లాలో..

నియోజకవర్గం	2019	2024
చింతలపూడి	81.83	80.05
దెందులూరు	84.70	85.01
ఏలూరు	67.59	71.02
కైకలూరు	88.50	87.50
నూజివీడు	86.19	87.32
పోలవరం	86.55	84.16
ఉంగుటూరు	86.88	87.75

పశ్చిమగోదావరి జిల్లాలో..

నియోజకవర్గం	2019	2024
ఆచంట	81.46	82.80
భీమవరం	77.73	79.35
పాలకొల్లు	81.55	82.28
నర్సాపురం	82.09	84.38
తణుకు	80.00	82.16
తాడేపల్లిగూడెం	80.43	81.60
ఉండి	84.73	86.20

స్ట్రాంగ్‌రూముల్లో ఈవీఎంలు భద్రం

భీమవరం/భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం రాత్రి 11.30 గంటల వరకు కొనసాగగా, భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్, విష్ణు ఇంజినీరింగ్ కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య భద్రపర్చారు. సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగిసి ఈవీఎంలను భద్రపర్చే వరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షించారు. సాధారణ పరిశీలకురాలు ఎం.దీప, ఎల్.నిర్మల్‌రాజ్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం వివరాలను పరిశీలిస్తే.. ఆచంట 82.80 శాతం, పాలకొల్లు 82.28, నరసాపురం 84.38, భీమవరం 79.35, ఉండి 86.20, తణుకు 82.16, తాడేపల్లిగూడెంలో 81.60 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియను సోమవారం ఉదయం ఐదు గంటల నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ నుంచి నిరంతరాయంగా పర్యవేక్షించారు. విష్ణు కాలేజీలో తణుకు, పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజక వర్గాలకు సంబంధించిన రిసెప్షన్ సెంటర్లను ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించిన రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలోనే ఆయా నియోజకవర్గాలకు సంబంధించి జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేసిన జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, రిటర్నింగ్ అధికారులను, ఇతర ఎన్నికల అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు.



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఈవీఎంలను భద్రపర్చిన గదికి కలెక్టర్ సమక్షంలో సీల్ వేస్తున్న దృశ్యం

అర్ధరాత్రి కూటమి నేతల హైడ్రామా

- ఈవీఎంలను మార్చుతున్నారని ఆరోపిస్తూ ఆందోళన
- రిజర్వ్‌డ్ ఈవీఎంలను కలెక్టర్ తేల్చడంతో వెనుదిరిగిన నేతలు

భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కూటమి నేతలు అర్ధరాత్రి హైడ్రామా సృష్టించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను తరలిస్తున్న వాహనం మధ్యలో ఆగడంతో అధికార పార్టీ నాయకులు ఈవీఎంలను మార్చుతున్నారంటూ గందరగోళం సృష్టించి లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. వివరాల్లోకి వెళితే.. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రం 6 గంటలకే ముగియాల్సి ఉండగా, కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద భారీ సంఖ్యలో క్యూలు కట్టడంతో వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి 10 గంటల తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. పోలింగ్ అనంతరం సిబ్బంది తమకిచ్చిన ఈవీఎంలను భీమవరంలోని విష్ణు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్స్‌లో భద్రపర్చడానికి వాహనాల్లో బయలుదేరారు. రాత్రి 1 గంట దాటిన తరువాత కూడా కొన్నిచోట్ల నుంచి ఈవీఎంలను తరలించే వాహనాలు వస్తూనే ఉన్నాయి. ఇదే సమయంలో ఈవీఎం తరలించే వాహనం దారి మధ్యలో నిలిచిపోయిందని, ఈవీఎంలను మార్చుతున్నారంటూ సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం చేయడంతో బీజేపీ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు నిజానిజాలను నిర్ధారించకోకుండా ఎస్ఆర్‌కేఆర్ కళాశాల వద్ద అర్ధరాత్రి ఆందోళన చేపట్టారు. దీంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని నిలిచిన వాహనం పోలింగ్‌కు వాడిన ఈవీఎంల వాహనం కాదని రిజర్వ్‌డ్ ఈవీఎంలకు సంబంధించిందని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు అదనంగా రెండు, మూడు ఈవీఎంలను పంపుతారని, పోలింగ్ జరిగే సమయంలో ముందుగా ఇచ్చిన ఈవీఎం వినియోగంలో ఇబ్బంది ఏర్పడితే రిజర్వ్‌డ్‌లో ఉంచిన ఈవీఎంలను వినియోగిస్తారని కలెక్టర్ వారికి వివరించారు. రిజర్వ్‌డ్‌లో ఉంచిన ఈవీఎంలను తిరిగి తీసుకు వస్తున్న వాహనమని స్పష్టం చేశారు. దీంతో ఆందోళన విరమించి నాయకులు వెనుదిరిగారు.



భీమవరంలో బీజేపీ, టీడీపీ నాయకులకు విషయాన్ని వివరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వైఎస్సార్ సీపీకే మళ్లీ అధికారం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓట్లు వేయడానికి పెద్ద ఎత్తున మహిళలు రావడం సంతోషకరమన్నారు. తీవ్రమైన ఎండలోనూ ఓటర్లు బారులు తీరి ఓటు వేశారన్నారు. రాత్రి పది గంటలు దాటుతున్నా ఓపికగా నిరీక్షించి ఓట్లు వేసి వెళ్లారన్నారు. ఎవరికి ఓట్లు వేయాలో ప్రజలు ముందే నిర్ణయించుకుని పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చారన్నారు. మహిళా ఓటర్లు జగన్‌కే మద్దతు పలికారని, శాంతిభద్రతలకే ప్రాముఖ్యతనిచ్చి ఓట్లు వేశారన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద కూటమి అభ్యర్థులు హల్‌చల్ చేయడం అమానుషమన్నారు. కూటమి అభ్యర్థి, తన అనుచరులతో పాటు నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పోలింగ్ బూత్‌ల వద్ద దౌర్జన్యకాండకు పాల్పడ్డారని మంత్రి కొట్టు ఆరోపించారు. పోలీసులు వారిని నిలురించారని తెలిపారు. కొందరు వ్యక్తులు భారీ గెడ్డాలతో తిరిగారని, వారు ఎక్కడి నుంచి వచ్చారో తెలియరాలేదన్నారు. కూటమి నేతలు తీసుకువచ్చిన కిరాయి వ్యక్తులు ఓటు స్లిప్పులను పట్టుకు తిరుగుతుండటంపై ఎన్నికల అధికారికి సమాచారం అందించడంతో పోలీసుల హెచ్చరించి వారిని బూత్‌ల నుంచి పంపించేవేయడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు.

వైఎస్ జగన్ రెండోసారి సీఎం కావడం ఖాయం

ఇచ్చిన మాటను చిత్తశుద్ధితో అమలు చేసిన వైఎస్సార్‌సీపీనే మళ్లీ అధికారం చేపడుతుందని, ధర్మమార్గాన్ని నడచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేస్తారని మంత్రి కొట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అప్సడా వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాంనాయుడు, ఏఎంసీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, తెన్నేటి జగ్జీవన్, సంపత్‌రావు కృష్ణారావు, వెలిశెట్టి నరేంద్రకుమార్, సూర్పణ రామకృష్ణ పాల్గొన్నారు.

కేసుల రాజీకి కృషి చేయాలి

ఏలూరు (టూటౌన్): కోర్టుల్లో కేసులకు సంబంధించి ఇరుపక్షాలకు సమన్యాయం చేసేందుకు రాజీ ప్రయత్నం ద్వారా న్యాయవాదులు, న్యాయమూర్తులు ఉమ్మడిగా కృషి చేయాలని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కోరారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాభవన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు అవగాహన సదస్సు మంగళవారం ఏర్పాటుచేశారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రత్నప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకే ఈ సదస్సు ఏర్పాటుచేశామన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకుని రాజీ మార్గం ద్వారా కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. కానాల రామకృష్ణారావు, టి.సుబ్బారావు, పి.రత్నరాజు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఏలూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎస్ఎంఎం నాగరాజు పాల్గొన్నారు.

చికెన్ తెగ తినేశారు

సార్వత్రిక పోరు సందర్భంగా ఉమ్మడి జిల్లాలో చికెన్ విక్రయాలు రెట్టింపు స్థాయిలో జరిగాయి. నోటిఫికేషన్‌కు ముందు నుంచే విందు భోజనాల హడావిడి మొదలైంది. ఓట్ల పండుగలో నాన్‌వేజ్ వంటకాలెన్ని వడ్డించినా చికెన్‌దే సింహ భాగమైంది. రికార్డు స్థాయిలో బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు జరగ్గా, గత నెల రోజుల్లో మాంసాహార ప్రియులు రూ.435 కోట్లు విలువైన చికెన్‌ను లొట్టలేసుకుంటూ లాగించేశారు.

- సార్వత్రిక పోరు వేళలో చికెన్ విక్రయాల జోరు
- సంఘాలు, సామాజిక వర్గాల వారీగా విందులు
- నోటిఫికేషన్‌కు ముందు నుంచే హడావిడి మొదలు
- ఉమ్మడి జిల్లాలో రోజుకు 2.5 లక్షల కిలోల వినియోగం
- ఎన్నికల నెల రోజుల్లో రెట్టింపు స్థాయిలో అమ్మకాలు
- సాధారణ వేసవికి భిన్నంగా రూ.290 పలికిన కిలో ధర
- ఒక నెలలో రూ.435 కోట్ల విలువైన చికెన్ లాగించేశారు



సాక్షి, భీమవరం: ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విందు భోజనాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. చుట్టూ ఉన్న కేడర్‌ను కాపాడుకునేందుకు ఆశావాహుల ఇంట నోటిఫికేషన్‌కు ముందు నుంచే ఈ సందడి మొదలవుతుంది. ఎన్నికల సమీపించే కొద్ది వివిధ సంఘాల వారికి విందులు ఏర్పాటు చేస్తుంటారు. ఈ క్రమంలో గత నెల రోజులలోగా జిల్లాలోని ఏ నియోజకవర్గంలో చూసినా ఆత్మీయ కలయికల పేరిట రాజకీయ విందులే. అభ్యర్థులు తమ ఎన్నికల కార్యాలయాల వద్ద ప్రతి రోజు కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేస్తూ వచ్చారు. నామినేషన్లు, ప్రచార కార్యక్రమాల్లో కేడర్ కోసం ప్రత్యేక విందులు వడ్డించారు. మరోపక్క మండల, నియోజకవర్గ స్థాయిలో వివిధ సామాజిక వర్గాలు, ఆటో, తోపుడుబండ్ల యూనియన్లు, వివిధ వర్తక సంఘాలతో పాటు ఎక్కువగా ప్రజల్లో ఉండే పీఎంపీలు, పాస్టర్లు, డ్వాక్రా సంఘాల లీడర్లు తదితర వర్గాల వారికి పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. వారి కోసం ఏర్పాటు చేసిన విందు భోజనాల్లో చేప, రొయ్య వంటకాలు చేసినా మాంసాహార ప్రియులు ఎక్కువగా ఇష్టపడే చికెన్‌కే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.

గరిష్ట స్థాయి విక్రయాలు

సాధారణంగా ఉమ్మడి జిల్లాలో రోజుకు 2.5 లక్షల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతుంటాయి. ఆదివారం, పండగ రోజుల్లో రెట్టింపు స్థాయిలో అమ్మకాలుంటాయి. ఎన్నికల సంగ్రామం నేపథ్యంలో గత నెల రోజులుగా రాజకీయ పార్టీల నేతల నుంచి హోల్‌సేల్ వ్యాపారులకు రోజూ వందల కిలోల చికెన్ ఆర్డర్లు వచ్చాయి. గత నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా అంతకు వారం పది రోజుల ముందు నుంచి చికెన్ ఆర్డర్లు రావడం మొదలైందని వ్యాపారులు అంటున్నారు. నామినేషన్లు, ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆర్డర్ల జోరు మరింత పెరిగిందంటున్నారు. రోజువారి అమ్మకాలతో పోలిస్తే సగటున గత నెల రోజులుగా రెట్టింపు స్థాయిలో అమ్మకాలు జరిగాయని వారు తెలిపారు. మునుపెన్నడూ ఇంత భారీస్థాయిలో వరుసగా అమ్మకాలు జరిగింది లేదంటున్నారు.

కోళ్లు సిద్ధంగా.. ధర నిలకడగా

ఉమ్మడి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, పాలకొల్లు, పెనుగొండ, నరసాపురం తదితర ప్రాంతాల్లోని ఫాంలలో ఏడు లక్షలకు పైగా కోళ్ల పెంపకం చేస్తున్నారు. బ్రాయిలర్ కోడి వేసవిలో 40 రోజులకు, శీతాకాలంలో మేత ఎక్కువగా తీసుకోవడం వలన 35 రోజుల్లోనే రెండు కేజీలు వరకు బరువు పెరిగి వినియోగానికి వస్తుంటాయి. సాధారణంగా వేసవిలో ఎండల తీవ్రతకు కోళ్లు ఎక్కువగా మృత్యువాత పడుతుంటాయి. వేసవి తాపం నుంచి వాటికి ఉపశమనం కలిగించేందుకు షెడ్లపై వాటర్ స్ప్రింక్లర్లు, ఫ్యాన్లు తదితర వాటి ఏర్పాటుతో నిర్వహణ ఖర్చు తడిసిమోపెడవుతుంది. వేడి చేస్తుందన్న భావనతో చికెన్ వినియోగం తక్కువగా ఉండటం వలన డిమాండ్ లేక ధర పతనమవుతుంది. ఆయా కారణాలతో నష్టాలు చవి చూడాల్సి వస్తుందని వేసవిలో కొత్త బ్యాచ్‌లు తక్కువగా వేస్తుంటారు. అయితే ఈసారి ఎన్నికల సీజన్ కావడం వ్యాపారం బాగుంటుందని ముందే ఊహించి కొత్త బ్యాచ్‌లు సిద్ధం చేయడం వారికి కలిసొచ్చింది. వేసవిలో కిలో రూ.220 నుంచి రూ.250 మధ్య పలికే చికెన్ ధర ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రూ.280 నుంచి రూ.300 మధ్య నిలకడగా ఉందని హోల్‌సేల్ వర్గాలు అంటున్నాయి. సగటున కిలో రూ.290 చొప్పున సాధారణ అమ్మకాలు మేరకు రోజుకు రూ.7.25 కోట్లు చొప్పున నెలకు రూ.217.5 కోట్లు అమ్మకాలు జరుగుతాయని అంచనా. అయితే నెల రోజులుగా ఎన్నికల నేపథ్యంలో రెట్టింపు స్థాయిలో జరిగిన అమ్మకాల మేరకు జిల్లాలో రికార్డు స్థాయిలో రూ.435 కోట్లు మేర చికెన్‌ను మాంసాహారప్రియులు లాగించేశారంటున్నారు.

క్లుప్తంగా

ఎన్నికల దస్త్రాల పరిశీలన



భీమవరంలో ఎన్నికల దస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, దీప

భీమవరం: పాలకొల్లు నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన దస్త్రాలను మంగళవారం భీమవరంలోని సీతాపాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ సమక్షంలో సాధారణ పరిశీలకురాలు ఎం.దీప పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లు సంతకాలు చేసిన రిజిస్టర్లను పరిశీలించి, ఫొటో గుర్తింపు కార్డులతో ఎంతమంది ఓటు వేశారు, ఐడీ కార్డులు చూపించి ఎంతమంది ఓటు వేశారో పరిశీలించారు. అలాగే పోలింగ్‌కు సంబంధించిన పీవోలు, ఏపీవోలు లేఖలను కలెక్టర్ సుమిత్‌కుమార్ సమక్షంలో ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్, పాలకొల్లు నియోజకవర్గ ఆర్వో బి.శివనారాయణరెడ్డి, లైజన్ ఆఫీసర్ ఏవీ అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



అమరవరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

కుక్కునూరు: తేనెటీగల దాడితో ఉపాధి కూలీలు పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే మండలంలోని దామచర్ల గ్రామానికి చెందిన 20 మంది కూలీలు మంగళవారం ఉదయం స్థానిక చెరువు సమీపంలోకి ఉపాధి పనులకు వెళ్లారు. కాగా పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో ఉపాధి కూలీలు పరుగులు తీశారు. గాయపడ్డ కూలీలను స్థానికులు అమరవరం పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరూ తీవ్రంగా గాయపడలేదు.

మద్ది అంజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



మద్దిక్షేత్రంలో భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. సుమారు 1200 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని, వివిధ రూపాల్లో రూ.181,497 ఆదాయం లభించిందని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి

ఉంగుటూరు: యర్రమిల్లిపాడులో విద్యుదాఘాతానికి గురై నాలుగు పశువులు మృతి చెందాయి. రైతు కోట్ల సత్యనారాయణకు చెందిన పశువులు గ్రామ చెరువులో దిగిన సమయంలో.. అప్పటికే అక్కడ తెగిపడిన విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాయి. సుమారు రూ.2.50 లక్షల నష్టం జరిగిందని రైతు తెలిపారు.

ఓటింగ్‌లో ఆమెదే పైచేయి

- నరసాపురంలో మినహా అన్నిచోట్లా మహిళా ఓట్లే ఎక్కువ
- జిల్లాలో 6,14,077 మంది ఓట్లు వేసిన అతివలు
- 6,02,543 మంది ఓటు వినియోగించుకున్న పురుషులు
- పురుషుల కంటే అదనంగా 11,534 మంది మహిళల ఓటింగ్



భీమవరంలో ఓటువేయడానికి క్యూలైన్లో నిలబడిన మహిళలు (ఫైల్)

భీమవరం: అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు సోమవారం జిల్లాలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో సైతం పైచేయిగా నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారిత దిశగా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఆమె కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనే గాక రాజకీయంగా అందలమెక్కించడానికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడంతో గత ఐదేళ్లుగా మహిళలు పురోగతి దిశగా పయనిస్తున్నారు. దీనిలో భాగంగానే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవడంలో కూడా ముందు వరుసలో ఉన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 14,72,923 మంది ఓటర్లుకుగాను వీరిలో మహిళలు 7,51,313 మంది ఉండగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 11,534 మంది మహిళలు పురుషుల కంటే అదనంగా ఓట్లు వేయడం విశేషం. జిల్లా వ్యాప్తంగా 12,16,667 మంది ఓటు హక్కును వినియోగించుకోగా వారిలో మహిళలు 6,14,072 మంది, పురుషులు 6,02,534 మంది ఉన్నారు. ఒక్క నరసాపురం నియోజకవర్గంలో మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో ఓట్లు వేయడంలో మహిళలదే ఆధిక్యం.

నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల వివరాలివి

- భీమవరం నియోజకవర్గంలో మొత్తం 2,53,116 మంది ఓటర్లు ఉంటే ఇందులో 1,22,790 మంది పురుషులు, 1,30,275 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 2,00,857 మంది ఓటు వేయగా 101,656 మంది మహిళలు ఉంటే 99,174 మంది పురుషులు ఉన్నారు.
- ఆచంట నియోజకవర్గంలో 1,80,017 మంది ఓటర్లకుగాను 91,132 మంది మహిళలు, 88,881 మంది పురుషులు ఉన్నారు. వీరిలో 1,49,048 మంది ఓటు వేయగా ఇందులో 76,022 మంది మహిళలు ఉంటే పురుషులు 73,024 మంది ఉన్నారు.
- పాలకొల్లు నియోజకవర్గంలో 1,95,057 మంది మొత్తం ఓటర్లుకాగా 95,742 మంది పురుషులు, 99,309 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 1,60,489 మంది ఓటు వేయగా 80,648 మంది మహిళలు, 79,802 మంది పురుషులున్నారు.
- నరసాపురం నియోజకవర్గంలో 1,70,448 మంది మొత్తం ఓటర్లుకుగాను వీరిలో 84,667 మంది పురుషులు, 85,781 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 1,43,825 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 72,598 మంది పురుషులు, 71,227 మంది మహిళలు ఉన్నారు. నరసాపురంలో పురుషుల కంటే 1,114 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నా ఓట్ల నమోదులో 1,371 మంది పురుషులే ఎక్కువగా ఓట్లు వేశారు.
- ఉండి నియోజకవర్గంలో మొత్తం 2,24,725 మంది ఓటర్లుకాగా 1,10,146 మంది పురుషులు, 1,14,577 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,93,722 మంది ఓట్లు వేయగా 97,025 మంది మహిళలు, 96,695 మంది మహిళలున్నారు.
- తణుకు నియోజకవర్గంలో 2,34,575 మంది మొత్తం ఓటర్లుకుగాను 1,20,135 మంది మహిళలు, 1,14,435 మంది పురుషులు ఉన్నారు. వీరిలో 1,92,736 మంది ఓట్లు వేయగా 98,690 మంది మహిళలు, 94,042 మంది పురుషులున్నారు.
- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 2,14,985 మంది మొత్తం ఓట్లుకాగా 1,10,104 మంది మహిళలు, 1,04,871 మంది పురుషులు ఉన్నారు. వీరిలో 1,75,990 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 88,773 మంది మహిళలు, 87,208 మంది పురుషులున్నారు.

కొబ్బరి గోడౌన్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కొబ్బరి కురిడి కాయల గోడౌన్ దగ్ధమై రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బద్దవానిపేట 27వ వార్డులో బీరా ప్రభాకరరావుకు చెందిన కొబ్బరి కురిడీ కాయల గోడౌన్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైందని తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందివ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ గోడౌన్‌లో సుమారు 70 వేల వరకూ కురిడీ కాయలు నిల్వ ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

ఎర్ర చిత్ర మూలం.. దివ్య ఔషధం

- పశ్చిమ మన్యంలో కనిపించే అరుదైన మొక్క
- పలు రకాల వ్యాధుల చికిత్సకు ఇది దివ్య మూలిక
- ఊపిరితిత్తులు, కిడ్నీ, మోకాళ్ల నొప్పులకు సైతం మంచి వైద్యం అంటున్న ప్రకృతి, ఆయుర్వేద వైద్యులు



అటవీప్రాంతంలో ఉండే ఎర్రచిత్ర మూలం మొక్క

బుట్టాయగూడెం: పశ్చిమ మన్యంలోని అడవుల్లో ప్రకృతి అందాలు ఆహ్లాదాన్ని పంచడమే కాకుండా వివిధ రకాల జంతువులు, రకరకాల చెట్లు, ఎన్నో రకాల ఔషధ మొక్కలకు కూడా నిలయంగా ఉన్నాయి. అరుదైన మొక్కలు కూడా ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులు అడవిలో లభించే ఔషధ మొక్కలతోనే తరతరాలుగా వారికి వచ్చే ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. అయితే ఇంగ్లీష్ మందులు, ప్రభుత్వ వైద్యసేవలు మారుమూల గిరిపల్లెల్లో సైతం అందుబాటులోకి రావడంతో మూలిక ఔషధాలను కొందరు మాత్రమే వినియోగించుకుంటున్నారు. పూర్వీకులు నేటికీ అనేక మంది మూలిక వైద్యాన్నే అనుసరిస్తున్నారు. ప్రకృతి ఒడిలో లభించే అరుదైన ఔషధ మొక్కల్లో ఎర్ర చిత్రమూలం, నల్ల చిత్రమూలం, వెలిగే చిత్రమూలం, తెల్లచిత్రమూలం అనే నాలుగు రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. ఇవి ఆకు నుంచి వేరు వరకూ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడతాయని మూలిక వైద్యులు చెప్తున్నారు. అయితే ఈ మొక్కలు బుట్టాయగూడెం, పోలవరం మండలాల పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి.

ఎర్ర చిత్రమూలం ఉపయోగాలు

ఎర్ర చిత్రమూలం మొక్కతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఈ మొక్క అనువైన ప్రదేశంలో మాత్రమే పెరుగుతుంది. తెల్ల చిత్రమూలం, నల్లచిత్రమూలం, వెలిగే చిత్రమూలం మొక్కల కంటే ఎర్ర చిత్రమూలం అరుదైనదని మూలిక వైద్యులు అంటున్నారు. ఈ మొక్కలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఎర్రచిత్రమూలం వేరు, అశ్వగంధం వేరు, సుగంధ పాలవేరు, ఈశ్వర వేరు వీటన్నింటినీ ఎండబెట్టి సమూలంగా పొడి చేసుకుని ఉదయాన్నే పరగడుపున ఒక స్పూన్ పొడిని గోళీలా చేసుకుని మింగితే కేన్సర్‌తో పాటు కుష్టు వ్యాధికి కూడా ఈ మందు ఉపయోగపడుడతుందని ప్రకృతి వైద్యులు చెప్తున్నారు. అదేవిధంగా చిన్నపిల్లలకు వచ్చే పాలకుర్మా వ్యాధి నివారణకు కూడా ఎర్రచిత్ర మూలం వేరు ఉపయోగపడుతుందని చెప్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే యాంటీ బయాటిక్ ఔషదంగా ఈ ఎర్రచిత్ర మూలం మొక్క ఉంటుందని మూలిక వైద్యులు అంటున్నారు.

రోగనిరోధక శక్తిని పెంచే మొక్కలు

ఎర్రచిత్ర మూలం మొక్కతోపాటు తెల్లచిత్రమూలం, నల్ల చిత్రమూలం, వెలిగే చిత్రమూలం మొక్కలు సర్వరోగ నిరోధక శక్తిని పెంచే మొక్కలుగా ఉన్నాయి. వీటిని చాలా జాగ్రత్తగా సేకరించాలని ప్రకృతి వైద్యులు సూచిస్తున్నారు. ఔషధంగా వినియోగించుకోవాలంటే అనుభవజ్ఞులైన మూలిక, ఆయుర్వేద వైద్యులను సంప్రదించి సమపాళ్లలో తయారు చేసి వినియోగించాల్సి ఉంటుంది. అలాగే గిరిజన ప్రాంతంలో ఈ మొక్కలను చాలా నిష్టగా సేకరిస్తారు. సోమవారం, బుధవారం రోజుల్లో ఎక్కువగా ఈ మొక్కలను సేకరిస్తారు. మొక్కలను సేకరించి సమపాళ్లలో వినియోగించడం వల్ల మోకాళ్ల నొప్పులతో పాటు కాలేయం, ఊపిరితిత్తులు, మూత్ర పిండాల సమస్యలు తీరిపోతాయని మూలికా వైద్యులు సూచిస్తున్నారు.

చిత్రమూలం మొక్కలు.. దివ్య ఔషధాలు



అటవీప్రాంతంలో లభించే ఎర్ర చిత్ర మూలం, తెల్లచిత్ర మూలం, నల్ల చిత్రమూలం, వెలిగే చిత్రమూలం మొక్కలను దివ్య ఔషధాలుగా ఉపయోగిస్తారు. సరైన పరిజ్ఞానంతో ఈ మొక్కల వేర్లను వినియోగించుకుంటే సర్వరోగాలు నయమవుతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అనుభవం లేకుండా వీటిని వినియోగించుకుంటే దుష్ఫలితాలు కూడా ఉంటాయి. వీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి.

– కారం వాసు, గిరిజనుడు, ఎర్రాయిగూడెం, బుట్టాయగూడెం మండలం

ఆకు నుంచి వేరు వరకూ ఉపయోగమే



చిత్ర మూలం మొక్కలు ఆకు నుంచి వేరు వరకూ అనేక రకాలైన ఉపయోగాలు ఉన్నాయి. మా చిన్నతనంలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే వీటినే వాడేవారు. ముఖ్యంగా మోకాళ్ల నొప్పులకు ఎర్ర చిత్ర మూలం మొక్క ఎంతగానో ఉపయోగపడుతుంది. సరైన పద్ధతిలో సరైన మోతాదులో వీటిని వినియోగించుకుంటే ఔషధంలా పనిచేస్తుంది. అయితే చిత్ర మూలం వేరు మిరపకాయ కంటే కారంగా ఉంటుంది.

– బొల్లి విశ్వనాథరెడ్డి, కొండరెడ్డి గిరిజనుడు, పందిరిమామిడి, బుట్టాయగూడెం మండలం

16, 17 తేదీల్లో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 16, 17 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి యస్.భారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బాలురకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పోలసానిపల్లి పాఠశాల నందు 16వ తేదీన, బాలికలకు అదే పాఠశాలలో 17న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పెదవేగి, ఆరుగొలను, నరసాపురం గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 16వ తేదీ ఉదయం 9 గంటలకు పోలసానిపల్లిలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. అలాగే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 17వ తేదీ ఉదయం 9 గంటలకు పోలసానిపల్లి పాఠశాల ప్రాంగణంలో కౌనెల్సింగ్‌కు హాజరు కావాల్సిందిగా కోరారు. ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో సీట్లు భర్తీ చేయడం జరిగిందని, మిగిలిన సీట్లు మెరిట్‌తో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా సీట్లు భర్తీ చేయబడతాయని చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ప్రవేశ పరీక్ష హాల్ టిక్కెట్, ర్యాంక్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పదోతరగతి మార్క్ లిస్ట్, ఆధార్ తమ వెంట తీసుకు రావాలన్నారు. బాలురకు సంబంధించి మొత్తం 140 సీట్లు ఖాళీలుండగా వీటిలో ఎస్సీ–94, బీసీ–10, బీసీ–సి 27, ఎస్టీ–6, ఓసీ–3 సీట్లు కలవని చెప్పారు. బాలికలకు సంబంధించి మొత్తం 122 సీట్లు ఖాళీలు ఉండగా వీటిలో ఎస్సీ–97, బీసీ–11, బీసీ–సి 2, ఎస్టీ–12 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా సమన్వయ కర్త యస్.భారతి కోరారు.

హమ్మయ్య చల్లబడింది..



ఉదయం నుంచి ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం మేఘావృతమైన ఆకాశం.. వెంటనే ఈదురుగాలులతో వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు సేదతీరారు. తాడేపల్లిగూడెంలోని పోలీస్ ఐలాండ్ ప్రాంతంలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటున్న దృశ్యమిది. – పెంటపాడు

గోల్డ్‌మెడల్ సాధించిన కుసుమకు సత్కారం



రావాడ కుసుమను అభినందిస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం గ్రామానికి చెందిన రావాడ కుసుమ జాతీయ స్థాయి లాంగ్‌జంప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నౌడూరు జంక్షన్ నేషనల్ ఫ్లాగ్ టవర్ వద్ద మంగళవారం ఆమెను సత్కరించారు. నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మాత వడ్డి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు వక్తలు కుసుమ ప్రతిభను, పట్టుదలను అభినందించారు. శాలువాతో సత్కరించి రూ.10వేలు నగదు అందజేశారు. ఆమె మరిన్ని పతకాలు సాధించి తమ ప్రాంతానికి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సేంద్రియ ఎరువులతో బహుళ ప్రయోజనాలు

- రసాయన ఎరువులతో నిర్జీవంగా మారుతున్న భూములు
- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయ అధికారులు



ఉద్యాన తోటలకు వేయడానికి పశువుల ఎరువును రైతులు ట్రాక్టర్‌కు ఎత్తుతున్న దృశ్యం, ఎండీ షాఫియ ఫర్వీన్, ఉద్యాన శాఖ హెచ్‌ఓ (అంతరచిత్రం)

చింతలపూడి: అధిక దిగుబడులను ఆశించి రైతులు విచక్షణా రహితంగా రసాయన పురుగు మందులు వాడటం వలన భూములు నిర్జీవంగా మారుతున్నాయి. బహుళ ప్రయోజనకారులైన సూక్ష్మ జీవులు నశించడం వలన వాటి ద్వారా లభించే సేంద్రియ పదార్థాలు, సూక్ష్మ పోషక పదార్థాలు పూర్తిగా అదృశ్యమవుతున్నాయి. దీని వల్ల మొక్కల్లో పెరుగుదల నశిస్తుంది. ఉద్యాన పంటల్లో సమగ్ర యాజమాన్యాన్ని రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ముఖ్యంగా ఉద్యాన పంటల్లో 50 శాతం సేంద్రియ, 50 శాతం రసాయన ఎరువులు వాడితే మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యానశాఖ అధికారిణి ఎండీ షాఫియ ఫర్వీన్ సూచిస్తున్నారు.

సేంద్రియ ఎరువులంటే..

సేంద్రియ ఎరువుల్లో పశువుల ఎరువు, మేకలు, గొర్రెల ఎరువు, వర్మి కంపోస్ట్‌తో పాటు కోళ్ల పెంట ప్రముఖమైనవి. వీటిల్లో మొక్కలకు కావాల్సిన ప్రధాన పోషకాలైన జింక్, మెగ్నీషియం, మాంగనీస్, బోరాన్ తదితరాలు మొక్కలకు దొరుకుతాయి. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఏకైక సేంద్రియ ఎరువు కోళ్ల ఎరువు మాత్రమే. కోళ్ల ఎరువులో ఎక్కువ మొత్తంలో నత్రజని 3 శాతం, భాస్వరం 2.5 శాతం, పొటాష్ 1.2 శాతం ఉంటాయి. ఉద్యాన పంటలైన కూరగాయల పంటలకు ఎకరానికి 500 కేజీల కోళ్ల ఎరువు సరిపోతుంది. ఈ ఎరువును రసాయన ఎరువుతో కలిపి వాడితే 20 నుంచి 25 శాతం నత్రజనిని ఆదా చేయవచ్చు.

పచ్చికోళ్ల ఎరువు వద్దు

పచ్చికోళ్ల ఎరువును ఎట్టి పరిస్థితుల్లోను మొక్కలకు వేయరాదు. దానిలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండటం వల్ల వేరు వ్యవస్థ మాడిపోయి మొక్కలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే కోళ్ల ఎరువును సేకరించాక బాగా మాగిన తరువాత మొక్కలకు వేసుకోవాలి. ఒక టన్ను కోళ్ల ఎరువుకు 15 కేజీల సూపర్ ఫాస్ఫేట్ కలిపితే తొందరగా కుళ్లిపోతుంది. కోళ్ల ఎరువును సాధారణంగా మొక్కలు నాటడానికి 20 రోజుల ముందుగా వేయాలి.

వివిధ ఉద్యాన పంటల్లో కోళ్ల ఎరువును ఏఏ మోతాదులో వాడాలి అంటే..

పామాయిల్ తోటలకు	–	6 ఏళ్ల వయస్సున్న కాపుకాసే చెట్టుకు 50 కేజీలు
కొబ్బరి	–	8 ఏళ్ల వయస్సున్న కాపుకాసే చెట్టుకు 30 నుంచి 50 కేజీలు
అరటి	–	ఎకరానికి 5 టన్నులు
మామిడి	–	10 ఏళ్ల కాపుకాసే చెట్టుకు 50 నుంచి 70 కేజీలు
జీడి మామిడి	–	7 ఏళ్ల వయస్సున్న కాపుకాసే చెట్టుకు 40 కేజీలు
నిమ్మ, బత్తాయి	–	6 ఏళ్ల వయస్సున్న కాపుకాసే చెట్లకు 30 కేజీలు
బొప్పాయి	–	ఎకరానికి 3 నుంచి 5 టన్నులు
మిరప	–	ఎకరానికి 3 టన్నులు
పూల తోటలకు	–	ఎకరానికి 2 టన్నులు

టిప్పర్ లారీ ఢీకొని.. ఇద్దరు మృతి



టిప్పర్ కింద పడి ఉన్న ప్రకాష్ మృతదేహం

దెందులూరు: నాగులదేవునిపాడు వద్ద ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి టిప్పర్ లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి దెందులూరు ఎస్సై కే.స్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన గొర్రెల ప్రకాష్, పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి గుజ్జుల రంగారావు వరుసకు మామ, అల్లుళ్లు. వీరిద్దరూ ద్విచక్రవాహనంపై ఏలూరు నుంచి బయలుదేరి వేగివాడలోని గుజ్జుల రంగారావు ఇంటికి వెళ్తున్నారు. నాగులదేవునిపాడు గ్రామంలో చర్చి సమీపానికి వచ్చేసరికి ఏలూరు నుంచి వస్తున్న టిప్పర్ లారీ వీరి ద్విచక్రవాహనాన్ని వేగంగా వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గొర్రెల ప్రకాష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రంగారావు(50)ను ఏలూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ (50) చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. వీరిద్దరూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే దెందులూరు ఏఎస్సై ఎస్.వెంకటేశ్వరరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ విజయవాడ మేరిస్‌స్టెల్లా కాలేజ్ ఆవరణలో 7వ ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి కె కృష్ణారెడ్డి, గవ్వ శ్రీనివాస్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలుర జట్టు ఎంపిక ఈ నెల 16వ తేదీన మార్టేరు జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్, బాలికల జట్టు ఎంపిక ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో ఉదయం 9 గంటలకు చేపడతామని వెల్లడించారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌తో పాటు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు అసోసియేషన్ కార్యదర్శి కె మురళీకృష్ణ 94411 71933 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో పాల్గొన్న సిబ్బంది, ఆశా కార్యకర్తలు

పెంటపాడు: ఆరోగ్యకరమైన పండంటి బిడ్డకు జన్మనిచ్చేందుకు గర్భిణులు ప్రత్యేక శ్రద్ధలు తీసుకోవాలని, వారి ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక అవగాహన కల్పించాలని ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు గర్భిణీలకు సంబంధించి కిల్కారీ మొబైల్ సేవలపై ఆమె అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖలో పని చేసే కిల్కారీ మెబైల్ సేవల వల్ల గర్భిణులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నాలుగు నెలల నుంచి బిడ్డ పుట్టే వరకు, అనంతరం చంటిబిడ్డ ఏడాది వయస్సువచ్చేవరకు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో క్షుణ్ణంగా వివరించారు. ఆశా కార్యకర్తలు కిల్కారీ మొబైల్ అకాడమీ నుంచి కోర్సును పూర్తిచేసి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పీహెచ్ఎన్ టీవీ ప్రసన్న, సూపర్‌వైజర్ కె. మోహనరావు, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న సూర్యనారాయణ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు, మూలవిరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, ఫలరాసాలతోను విశేష అభిషేకాలు జరిగాయి. ఆవరణలోని పరివార దేవతలకు పూజలు చేశారు. ప్రధాన పురోహితులు సత్యనారాయణ శర్మ, తరుణ్ శర్మలు బ్రహ్మత్వం వహించారు. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, పేరూరి కాశయ్యలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ గెలుపు కోసం ప్రజలు ఓట్లు వేశారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ కొట్టు సత్యనారాయణ గెలుపు తథ్యమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని ప్రజలు నమ్మారని తెలిపారు. కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేష్, హిందూపురంలో బాలకృష్ణ, పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌లు ఓడిపోవడం ఖాయమని మంగరాజు జోస్యం చెప్పారు. జూన్ 4వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగనన్న ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బాలకృష్ణ, నాగేశ్వరరావు, డీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.



తణుకు రవాణా శాఖ కార్యాలయ ప్రాంతంలోని జగనన్న కాలనీలో ఇళ్లు



ఇరగవరం మండలం కావలిపురం జగనన్న కాలనీలో ఇళ్లు



ఇరగవరం మండలం గోటేరు జగనన్న కాలనీలో ఇళ్లు

ఎవరిల్లు.. వారిదే..

- ఇళ్ల స్థలాలపై పేదలకు సర్వహక్కులు
- జగనన్న కాలనీల్లోని స్థలాలకు రిజిస్ట్రేషన్లు

తణుకు అర్బన్: పేదల సొంతింటికల నెరవేర్చడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలులో భాగంగా లబ్ధిదారులకు ఒక స్థలం ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణానికి ప్రోత్సహించారు. జగనన్నకాలనీల పేరిట ఏకంగా ఊళ్లను నిర్మించిన ప్రభుత్వం కాలనీల్లో అన్ని వసతుల్లా సమకూర్చింది. అంతటితో ఆగకుండా ఆ స్థలాలపై పేదలకు పూర్తిహక్కులు కల్పించింది. జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి పత్రాలనులబ్ధిదారులకు అందజేసి సర్వహక్కులు కల్పించింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేశారు. రిజిస్ట్రేషన్లు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ప్రభుత్వం నిర్ణయంతో తణుకులో ఇంటిస్థలం వచ్చిన పేదలకు ఎంతో మేలు చూకూరింది. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి మొత్తం 120 లేఅవుట్‌లలో జగనన్న కాలనీలు రూపుదిద్దుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మంత్రి కారుమూరి అధికారుల సహకారంతో నియోజకవర్గంలో 350 ఎకరాలు భూమిని రూ. 162.07 కోట్లుతో కొనుగోలు చేయించి పట్టణ పరిధిలో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున అందజేయగా లబ్ధిదారులు తమకు అందిన భూమిలో ప్రభుత్వ పూర్తి సహకారంతో నిర్మాణాలు పూర్తి చేసి తమ కుటుంబంతో ప్రశాంతంగా జీవిస్తున్నారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణం చేసే ముందే విద్యుత్ మీటర్లు, మీటర్లు బిగించే సామాగ్రి ఉచితంగా అందజేశారు. జగనన్న కాలనీలన్నిటిలోను రహదారులు నిర్మాణాలు చేసి రూ. 129 కోట్లు నిధులతో విద్యుత్ సబ్ స్టేషన్‌లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలతో పూర్తిస్థాయి వెలుగులు నింపారు.



తణుకు మండలం దువ్వ గ్రామంలో జగనన్న కాలనీ ముఖద్వారం



తణుకు మండలం దువ్వ జగనన్న కాలనీలో ఇళ్లు



పైడిపర్రులోని జగనన్న కాలనీలో ఇళ్లు

నా కల నెరవేరింది



ఏళ్ల తరబడి నా సొంతింటి కల కలగానే మిగిలిపోతుందనుకున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం భూమి అందచేయడమే కాకుండా నిర్మాణానికి కూడా సహకరించారు. గత 8 నెలల కాలంగా తణుకు నియోజకవర్గంలోని పైడిపర్రులో ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని నా భర్తతో కలిసి నివసిస్తున్నాను.

– మానేపల్లి ప్రభావతి, పైడిపర్రు జగనన్న కాలనీ లబ్ధిదారు

గూడెంలో పోలింగ్ 81.86 శాతం నమోదు

తాడేపల్లిగూడెం: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో 81.86 శాతం పోలింగ్ నమోదైంది.పోలింగ్ సమయం సోమవారం సాయంత్రం ఆరుకే ముగియాల్సి ఉన్నప్పటికి క్యూలైన్లలో ఓటర్లు నిల్చుని ఉండటంతో ఆరు గంటల సమయానికి పోలింగ్ కేంద్రం దగ్గర ఉన్న వారికి పోలింగ్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చారు. నియోజకవర్గంలో 49 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి పదిగంటలు దాటే వరకు పోలింగ్ సాగింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎం, వీవీ ప్యాట్‌లను గూడెం డిస్ట్రిబ్యూషన్ పాయింటుకు తరలించారు. అనంతరం బస్సులలో భీమవరంలోని ఎస్ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాలకు పంపించారు. పోలింగ్ ముగియడంతో విజయావకాశాలపై చర్చ సాగుతోంది.

మండలాల వారీగా ఓటర్లు

తాడేపల్లిగూడెం మండలం–70686–పురుషులు–35007–మహిళలు –35678– ఇతరులు –01– పోలింగ్ కేంద్రాలు –75

పెంటపాడు మండలం–ఓటర్లు –52340–పురుషులు–25754–మహిళలు–26585–ఇతరులు–01– పోలింగ్ కేంద్రాలు –60.

గూడెం పట్టణం –మొత్తం ఓటర్లు–91959–పురుషులు–44110–మహిళలు–47841–ఇతరులు–08– పోలింగ్ కేంద్రాలు –74. పోలింగ్ 81.86 శాతం.

నేటి నుంచి గూడెంలో యోగా శిక్షణ తరగతులు

పెంటపాడు: వేసవి సెలవులు పురస్కరించుకొని గూడెం కడకట్ల కోడే వెంకటరావు హైస్కూల్లో యోగా క్లాసులు నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు జి. రూప ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ యోగా తరగతులు జరుగుతాయన్నారు. ఉచితంగా నిర్వహించబోయే ఈ తరగతులు మే నెల 30 వరకు కొనసాగుతాయన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా నిర్వహించే ఈ యోగా క్లాసుల్లో విద్యార్థులు, గృహిణిలు, చిన్నారులు, ఉద్యోగులు తప్పక పాల్గొనాలన్నారు.

200 రోజులు పనిదినాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకంలో 200 పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించాలని, సమ్మర్ అలవెన్సులు ఇవ్వాలని, రూ.600లు కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. మందుబాబులు తాగి పారేసిన మద్యం సీసాల మధ్య ఉపాధి కూలీలు పనిచేసిన సందర్భంలో గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం సమగ్రం అమలుకు ఉపాధి కూలీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

మాతా శిశు ఆరోగ్యానికి కిల్కారి సేవలు



కిల్కారీ వాయిస్ మెసేజ్ ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మాతా శిశు ఆరోగ్యం బలపరిచే దిశగా ఆరోగ్య శాఖ కిల్కారీ వాయిస్ మెసేజ్ ప్రవేశపెట్టడం జరిగిందని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో ఆయన మాట్లాడారు. వాయిస్ మెసేజ్ ద్వారాప్రతీ వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్ వస్తుందన్నారు. తద్వారా తల్లీ, బిడ్డ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఒకవేళ వాయిస్ మెసేజ్ మిస్ అయితే 14423కి కాల్ చేసి మరలా వినవచ్చన్నారు. ఇప్పటికే ఈ వాయిస్ మెసేజ్‌పై ఆశా కార్యకర్తలకు శిక్షణ నివ్వడం జరిగిందన్నారు. వైద్యారోగ్య శాఖ ప్రవేశపెట్టిన ఈ వాయిస్ మెసేజ్‌కు మంచి స్పందన వస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన స మాజం ఏర్పడటంతో కిల్కారీ వాయిస్ మెసేజ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఉపకరిస్తాయన్నారు.

జగన్ వెంటే జనం



అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలోని క్యాడర్ సీఎం జగన్, స్థానిక వైఎస్సార్ సీపీ అభ్యర్థి , డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణలపై అభిమానంతో పోలింగ్ ప్రక్రియలో కష్టపడ్డారని అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారందరూ ఓటు ద్వారా తమ కృతజ్ఞతలు తెలియజేయడానికి ఉదయం నుంచి బారులు తీరి ఉన్నారన్నారు. వీరితో పాటు పార్టీ క్యాడర్ తీవ్రంగా శ్రమించిందన్నారు. వారి కష్టాన్ని , శ్రమను విస్మరించబోమని, తాను కాని, ఎమ్మెల్యే కొట్టు గాని, ఇతర నాయకులు సీఎం కాని వారి సేవలను గుర్తుంచుకుంటారన్నారు. ఈ క్రమంలో పార్టీలో వారికి సముచిత స్థానం కల్పించే బాధ్యతను తాను తీసుకుంటానని రఘురాం అన్నారు. ఓటరు దేవుళ్లకు, ప్రజలకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా శిరస్సు వంచి చేతులు జోడించి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గాలివాన బీభత్సానికి తాడేపల్లిగూడెం పలుచోట్ల వృక్షాలు నేలకు ఒరిగాయి. మంగళవారం సాయంత్రం సుమారు గంటసేపు సంభవించిన గాలివాన గ్రామస్తుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. రోడ్లపైకి డ్రెయినేజీలోని నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులు వీయడంతో చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

20 ఏళ్ల నాటి స్నేహ బంధం



తణుకులో జెడ్పీ బాయ్స్ హైస్కూలు 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తణుకు అర్బన్: తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ 2003–04 పదో తరగతి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. తణుకు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న సిల్వర్ స్పూన్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ పాత రోజులను గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్లనాటి స్నేహ బంధం ఒకే వేదికపై కలుసుకోవడంతో ఆనాటి ఆటపాటలు, పోటాపోటీ విద్యతోపాటు పాఠశాల ఎగ్గొట్టి చూసిన సినిమాలు, గురువుల బెత్తం దెబ్బలు ఒకరికొకరు నెమరివేసుకున్నారు. తమ తల్లి తండ్రుల ఆశీస్సులు, గురువుల కృషి కారణంగానే తాము ఈరోజు మంచి స్థితిలో ఉన్నామంటూ అప్పటి గురువులను ప్రత్యేకంగా సత్కరించారు. 20 ఏళ్ల క్రితం ఉన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు నేడు పూర్తిగా మారిపోయాయని, పాఠశాలల్లో మంచి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని రానున్న రోజుల్లో తమ వంతుగా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం రాష్ట్ర నలుమూలల్లోను ఉన్న 130 మంది పూర్వ విద్యార్థులు ఒక్కటై ఉల్లాసంగా గడిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు సొంత ప్రాంతానికి వచ్చిన క్రమంలో ముందుగానే అందరం ఆలోచించుకుని ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు.

16న ఉచిత వైద్యసేవలు

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ సేవా ఛారిటీ ఆస్పత్రిలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు పలువురు ప్రముఖ వైద్యులతో ఆరోగ్యసేవలు ఉచితంగా అందజేయనున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు ఎముకలు, కీళ్లు, చర్మవైద్య నిపుణులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కుగొంతుకు వైద్య పరీక్షలు, చేస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎవరి లెక్కలు వారివి

- ఆసక్తి రేపుతున్న ఎన్నికల సరళి
- పోలింగ్‌లో ఓటెత్తిన మహిళలు
- మెజార్టీ మొగ్గు వైఎస్సార్ సీపీ వైపే



తణుకు మండలం తేతలి గ్రామంలో పోటెత్తిన మహిళలు

తణుకు: అన్నా... మీ బూత్లో ఓట్లు ఎలా పడ్డాయి... మా దగ్గరైతే మొత్తం ఓట్లన్నీ ఆ పార్టీకే పడ్డాయి... ఈ సారి క్రాస్ ఓటింగ్ జరిగిందంట కదా... ఇలా ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. నియోజకవర్గ రాజకీయంపై స్థానికులే కాకుండా పొరుగు జిల్లాలకు చెందిన వాళ్లు సైతం పోలింగ్ తీరుపై ఆసక్తిగా అడుగుతున్నారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు పూర్తికాగానే... ఓట్లు ఎటు పడ్డాయన్న చర్చ మొదలైంది. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి ఓటింగ్ ఆసక్తికరంగా సాగింది. ప్రధాన పార్టీలైన వైఎస్సార్సీపీ, కూటమి మధ్యనే ప్రధాన పోరు జరగ్గా పోలింగ్ జరిగిన తీరుతో ఫలితంపై ఆసక్తి పెరిగింది. ఎక్కడ చూసినా... ఏ నలుగురు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ సాగుతోంది. పోలింగ్ పూర్తయిన వెంటనే అభ్యర్థులు, నాయకులతో పాటు సామాన్యులు సైతం ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తున్నారు... ఎవరెవరికి ఎక్కడెక్కడ ఓట్లు పడ్డాయి... అనే అంచనాలపై జోరుగా చర్చ సాగుతోంది. 2019 ఎన్నికలతో పోల్చితే ఈ సారి పోలింగ్ శాతం పెరిగింది. కొన్ని చోట్ల ఈవీఎంలు పని చేయని కారణంగా కొన్ని బూత్‌లతో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. 2014 ఎన్నికల్లో 84 శాతం పోలింగ్ నమోదు కాగా 2019 ఎన్నికల్లో కాస్త తగ్గి 82.20 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఎన్నికల్లో కాస్త తగ్గి 82.12 శాతంగా నమోదైంది. మరోవైపు పురుషులకంటే మహిళలే ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు 2,34,575 మంది ఉండగా వీరిలో పురుషులు 1,14,435 మంది, మహిళలు 1,20,135 మంది ఉన్నారు. వీరిలో 1,92,627 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పుసుషులు 93,979 మంది కాగా మహిళలు 98,644 మంది ఉన్నారు. అయితే ఈసారి ఫలితం వైఎస్సార్ సీపీకు అనుకూలంగా ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కాయ్.. రాజా కాయ్...

ఈ సారి నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారనే అంశంపై జోరుగా పందేలు కడుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఫలానా నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది? తదితర అంశాలపై పందేలు కడుతున్నారు. పోలింగ్ జరిగిన రోజున కూటమి అభ్యర్థులకు సంబంధించిన పందెంరాయుళ్లు పెద్ద ఎత్తున పందేలకు ఆహ్వానించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీయడంతో వైఎస్సార్ సీపీకి అను కూలంగా పందేలు కట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు బూత్ వారీగా లెక్కలు కట్టి గెలుపోటములపై ఒక అంచనాకు వచ్చిన కొందరు టీడీపీ పెద్దలు కింది స్థాయి నేతలను హెచ్చరిస్తున్నారు. పందేల విషయంలో ఆచితూచి అడుగులు వేయాలని ప్రతిష్టకు పోకుండా జాగ్రత్త పడాలని సూచిస్తు న్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో వైఎస్ర్సా సీపీ అధికారంలోకి వస్తుందనే పందేలకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా పందెం కట్టే విషయంలో కూటమి నేతలు ఒకడుగు వెనక్కి తగ్గుతున్నారు.